క్లుప్తంగా

ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలి



అంబకండి - 2 గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు

రేగిడి: సచివాలయాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని, వీటిలో పని చేస్తున్న ఉద్యోగులు మరింత బాధ్యతగా పని చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు సూచించారు. మండలంలోని అంబకండి - 1, 2 గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా బుధవారం సందర్శించారు. రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అర్హులు పథకాల కోసం సచివాలయానికి వస్తే ఆన్‌లైన్‌లో దరఖాస్తులను నమోదు చేయాలని సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన



కంచరాంలో పనులు పరిశీలిస్తున్న అధికారులు

రాజాం: ఉపాధి పనులు కొలతల ప్రకారం సక్రమంగా చేయాలని ఎంపీడీఓ బాసూరీ శంకరరావు వేతనదారులకు సూచించారు. మండలంలోని కంచరాం గ్రామంలో బెవరవాని చెరువులో ఉపాధి పనులు బుధవారం ఆయన పరిశీలించారు. వేతనదారుల హాజరుపై ఆరా తీసి మస్టర్ తనిఖీ చేశారు. బినామీ మస్టర్లు వేయవద్దని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు, సీనియర్ మేట్‌లకు సూచించారు. రెండు పూటలా పని చేస్తే కనీస వేతనం వస్తుందని అన్నారు. ఏపీఓ సాయిరాం, వేతనదారులు పాల్గొన్నారు.

ఎస్‌డీజీ సర్వేపై సమీక్ష



ఎస్‌డీజీ సర్వేపై సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ

సంతకవిటి: మండలంలోని కొండగూడేం సచివాలయంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, వలంటీర్లతో ఎస్‌డీజీ సర్వేపై ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఏఎన్ఎం గైర్హాజరుపై ఆరా తీశారు. సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ఎస్‌డీజీ సర్వే వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఆధార్ కార్డు లేని పిల్లలను గుర్తించి, వారికి ఆధార్ కార్డులు చేయించుకోవాలని తల్లిదండ్రులకు తెలియజేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆదేశాలు జారీచేశారు. అనంతరం సచివాలయ సిబ్బంది హాజరును, సర్వీసులను పరిశీలించారు.

ఉపాధి వేతనదారులకు అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

వంగర: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై వేతనదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం సమీక్షించారు. ప్రతీ రోజు రెండు పూటలు పనుల్లో పాల్గొంటే రూ.272 వేతనం వస్తుందని తెలియజేయాలన్నారు. పనులు చేసే ప్రదేశాల్లో తాగునీరు అందుబాటులో ఉంచాలని, వేతనదారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో సామంతుల సంగంనాయుడు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ



జలాధివాసంలో పాల్గొన్న అధికారులు

రాజాం: పట్టణంలోని కొండంపేట గ్రామంలో శ్రీధర్మశాస్తా హరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ నాగరాజు, తహసీల్దార్ విజయభాస్కర్ తదితరులు బుధవారం పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా విగ్రహాలకు జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, శయ్యాధివాసం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావుతో పాటు పలువురు నేతలు కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త ముద్దన సత్యారావుతో పాటు కొండంపేట, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత పెంపే లక్ష్యం..

- టెన్త్, ఇంటర్‌లో తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



ప్రత్యేక తరగతులకు రావాలని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రామభద్రపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

రామభద్రపురం:

పది, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణత పెంపే లక్ష్యంగా సంబంధిత అధికారులు అడుగులేస్తున్నారు. ఇటీవల విడుదలైన పది, ఇంటర్ ఫలితాల్లో తప్పిన విద్యార్థులకు ఆయా పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 1 నుంచి ఇంటర్మీడియట్, 8వ తేదీ నుంచి పదో తరగతి విద్యార్థులకు రెమిడియల్ తరగతులు కొనసాగిస్తున్నారు. ఒకటి నుంచి మూడు సబ్జెక్టుల్లో తప్పిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా అన్ని సబ్జెక్ట్‌ల వారీగా అధ్యాపకులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సుమారు 20 రోజులు పాటు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిష్ణాతులైన ఉపాధ్యాయులచే తరగతులు నిర్వహించనున్నారు.

ఆందోళనకు దూరం..

పరీక్ష తప్పామని, మార్కులు తక్కువ వచ్చాయని విద్యార్థులు ఆందోళన చెందవద్దని అధ్యాపకులు సూచిస్తున్నారు. ప్రత్యేక తరగతులను వినియోగించుకుంటే సప్లిమెంటరీ పరీక్షల్లో సులువుగా గట్టెక్కవచ్చన్నారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ నెల 24 నుంచి జూన్ 7 వరకు.. పదో తరగతికి జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు జరగనున్నాయి.

సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు...



ఫెయిలైన వారు, సప్లిమెంటరీ పరీక్షలు రాసే వారు ప్రస్తుతం పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను వినియోగించుకోవాలి. దగ్గరలోని పాఠశాలలకు వెళ్లి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారు. సప్లిమెంటరీ పరీక్షల్లో పాస్ అయితే విద్యా సంవత్సరం వృథా కాదు.

– లింగేశ్వరరెడ్డి, డీఈఓ, విజయనగరం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కంబాల, ఎమ్మెల్సీ పాలవలస



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్రంలోని అన్ని వర్గాల రైతులు, ప్రజలను ఆదుకునేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. బుధవారం రేగిడి వచ్చిన వీరు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంటలు నష్టం వాటిల్లినప్పటికీ నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే పంట నష్టపరిహారం చెల్లించిందని అన్నారు. ప్రతిపక్ష నాయకులు నాలుగు ఓట్లు దండుకోవడం కోసం లేనిపోని అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్యపెట్టేందుకే లేనిపోని ప్రకటనలు చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రజల సమస్యలను నేరుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే తెలియజేసేందుకు జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని పెట్టిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించలేదని అన్నారు. ప్రజా సంక్షేమానికి అహర్నిశలు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు ఎన్నికల్లో తిప్పికొడతారని అన్నారు. 2024లో జరగనున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసేందుకు ప్రజలు ఉవ్విళ్లూరుతున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుతంత్రాలు పన్నినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో బుధవారం విశాఖపట్నంకు చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. అంబఖండి సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 77 మందికి తనిఖీలు నిర్వహించగా, 30 మంది కంటి ఆపరేషన్లుకు ఎంపికైనట్లు జిల్లా మహిళా ఐటీ ఇన్‌చార్జి హైమా వెల్లడించారు. ఆపరేషన్‌లకు ఎంపికైన వారికి విశాఖపట్నం తీసుకెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందరావు, భజన మండలి కన్వీనర్ వెంకటేశ్వరరావు మాస్టర్, ఎంపీటీసీ పుర్లి సత్యవతి, భజన మండలి కన్వీనర్ నారాయణరావు, సాయిచరణ్, తవిటినాయుడు, భీమారావుగుప్త తదితరులు పాల్గొన్నారు.

బిందు సేద్యంతో సాగునీటి ఆదా



రైతులకు అందించిన పైపులు పరిశీలిస్తున్న జిల్లా అధికారి లక్ష్మీనారాయణ

రేగిడి: ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న బిందు, తుంపర సేద్యానికి అవసరమైన పరికరాలు వినియోగించడం ద్వారా సాగునీటిని ఆదా చేసుకోవచ్చునని మైక్రో ఇరిగేషన్ జిల్లా సంచాలకులు లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ఖండ్యాం, వెంకటాపురం గ్రామాల్లో రైతులకు అందించిన స్ప్రింక్లర్ పైపులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదెకరాల్లోపు భూములు కలిగి ఉన్న రైతులకు బిందు సేద్యం నిమిత్తం 90 శాతం, తుంపర్ల శాతం 55 శాతం రాయితీతో ప్రభుత్వం పరికరాలు అందిస్తుందని అన్నారు. ఐదెకరాలు కంటే ఎక్కువ భూమి కలిగిన రైతులకు బిందు సేద్యానికి 50 శాతం, తుంపర్ల సేద్యానికి 45 శాతం రాయితీతో పరికరాలు అందిస్తున్నామని వివరించారు. 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో రేగిడి మండలంలో 107 మంది రైతులకు సంబంధించి 89.60 హెక్టార్లులో సాగునీటిని అందించేందుకు స్ప్రింక్లర్ పైపులు అందించడం జరిగిందన్నారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మరో 55 హెక్టార్లలో రైతులకు ఈ పరికరాలు అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ అధికారిణి శ్రీలత, ఎఫ్‌పీఓ వైవీ రమణ, సర్పంచ్ ముత్యాలమ్మ, ఎంపీటీసీ కింజరాపు సురేష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ శైలజ పలువురు రైతులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రా ద్వారా నాణ్యమైన చేపలు



ఫిష్ ఆంధ్ర యూనిట్‌ను ప్రారంభిస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

రేగిడి: ప్రజలకు మేలురకమైన, ఆరోగ్యకరమైన చేపలను అందించేందుకు ఫిష్ ఆంధ్ర మార్కెట్ ఉపయోగపడుతుందని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలో ఉనుకూరు వద్ద గ్రామానికి చెందిన కంచర లక్ష్మి ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర యూనిట్‌ను బుధవారం ప్రారంభించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే చేపలు, రొయ్యలు వంటివి తీసుకోవాలని తెలిపారు. వీటి ద్వారా పౌష్టికాహారం శరీరానికి అందుతుందని, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఇందులోని మాంసకృత్తులు కాపాడుతాయని వెల్లడించారు. మేలు రకంతో పాటు నాణ్యమైన, లైవ్ చేపలను ఈ ఫిష్ ఆంధ్రాలో దొరుకుతాయని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఈ ఫిష్ ఆంధ్ర ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తున్నారని అన్నారు. ఇదే సమయంలో ప్రజల ఆరోగ్య ప్రమాణాలు కూడా పెంచే కార్యక్రమాలు చేస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామ మత్స్య సహాయ అధికారి పాండ్రంకి శారద, రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గానకచేరి



ఆలయ ఆవరణలో గానకచేరి

సంతకవిటి : మండలంలోని మందరాడ గ్రామంలో గణపతి, షిర్డీసాయి, సత్యసాయి, సత్యనారాయణ స్వామి, నవగ్రహ ఆలయాల ప్రతిష్ఠ సందర్భంగా ఏర్పాటు చేసిన గానకచేరి పలువురిని ఆకట్టుకుంది. విజయనగరానికి చెందిన సంగీత గురువు తాతాజీ, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వప్నహైందవి, బి.రామకృష్ణ, శేఖర్ పలు భక్తి గీతాలతో కచేరి నిర్వహించారు. ప్రవచనాలు వెల్లడించారు. అంతకు ముందు ప్రతిష్ఠ కార్యక్రమాల్లో రెండో రోజు పూజల్లో భాగంగా క్షీరాధివాసం, ధాన్యాధివాసం వంటి పూజలు నిర్వహించారు. ఖండ్యాంకు చెందిన వేదపండితులు అంపోలు రుద్రకోటేశ్వరరావు శర్మ, రామప్రసాద్‌శర్మలతో పాటు గ్రామ పురోహితులు పులఖండం శ్రీనివాసరావు శర్మల పర్యవేక్షణలో పూజలు జరిగాయి.

నేడు పెదపల్లిలో గడప గడపకు...

బాడంగి: మండలంలోని తెంటువలస సచివాలయ పరిధిలోని పెదపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. హాజరై విజయవంతం చేయాలనికోరారు.

సచివాలయ భవనం ప్రారంభోత్సవం

మండలంలోని ఆనవరంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు గురువారం ప్రారంభిస్తారని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఐటీఐలో మెగా జాబ్‌మేళా రేపు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నిరుద్యోగ యువతకు ఈ నెల 12న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి బుధవారం తెలిపారు. వివిధ ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జాబ్ మేళాకు కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్, జేసీ మయూర్ అశోక్, డీఆర్ఓ గణపతిరావు, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి, ఎస్‌డీసీలు హాజరుకానున్నారని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులంతా ఉదయం 9గంటలకు బయోడేటాతో పాటు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

జాగ్రత్తలు తప్పనిసరి



వేతనదారుల మస్టర్లు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: ఉపాధి వేతనదారులందరూ వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండలంలోని లింగాపురంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల మస్టర్లపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎండలు ఎక్కువగా ఉన్నందున వేతనదారులంతా నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం తెచ్చుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో తప్పనిసరిగా టెంట్లు వేసుకోవాలన్నారు. సాంకేతిక, క్షేత్ర సహాయకులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే 257 రూపాయల వేతనం గిట్టుబాటు అవుతుందని చెప్పారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ

రాజాం సిటీ: పట్టణంలోని పేదలు, యాచకులకు సత్యసాయి భక్తుడు టి.ఈశ్వరరావు ఆహార పొట్లాలు, పండ్లు పంపిణీ చేశారు. బుధవారం భగవాన్ శ్రీ సత్యసాయిబాబు మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతిని పురస్కరించుకుని తన వంతు సాయంగా అందజేశానని ఆయన తెలిపారు. మానవసేవే మాధవ సేవ అనే బాబా మాటను ఆచరించడం తనకెంతో సంతోషంగా ఉందని అన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ

వంగర: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ ఆర్.జనార్దన తెలిపారు. వంగర, మగ్గూరు, మడ్డువలస జంక్షన్ల వద్ద బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. వేగాన్ని నియంత్రించుకొని వాహనాలు నడపాలన్నారు. అధిక లోడ్లుతో ప్రయాణం చేయవద్దని తెలిపారు.

శ్రీశ్రీ కళావేదిక యువజన విభాగం అధ్యక్షునిగా ఈశ్వరరావు

రాజాం సిటీ: శ్రీశ్రీ కళావేదిక జిల్లా యువజన విభాగం అధ్యక్షునిగా తనను నియమించారని పోలాకి ఈశ్వరరావు బుధవారం తెలిపారు. ఇటీవల విజయవాడలో కళావేదిక ప్లీనరీ సమావేశం జరిగిందని అన్నారు. సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నికతో పాటు నియామక పత్రాలను శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ అందజేశారని పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా బి.సుందరరావు, తేజస్విని, ప్రధాన కార్యదర్శిగా డి.రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రేయ, కార్యదర్శులుగా సాలూరు సంతోషి, ఆదిత్య విష్ణువర్ధన్, ఆర్.ఈశ్వరరావులను నియమించారని తెలిపారు.



ఈశ్వరరావుకు నియామకపత్రం అందజేత

పౌష్టికాహారంతో ఆరోగ్యం



చాటాయివలస కేంద్రంలో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

రేగిడి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని రాజాం సీడీపీఓ సిమ్మాలమ్మ అన్నారు. మండలంలోని చాటాయివలస అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పాలు, గుడ్లు, భోజనాన్ని ప్రతిరోజూ కేంద్రానికి వచ్చి తీసుకోవాలన్నారు. పుట్టిన పిల్లలకు డబ్బా పాలు అనారోగ్యమని, తల్లి పాలే శ్రేష్ఠమన్నారు. కార్యక్రమంలో వన్నలి, వండానపేట, ఉప్పరనాయుడువలస, చాటాయివలస, కేఎం వలస అంగన్‌వాడీ కార్యకర్తలు ఉదయాన చంద్రకళ, జయలక్ష్మి, రాణి, పి. భాను, రత్నాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

'క్రాష్'తో తాగునీటి బోర్ల మరమ్మతులు



కంచరాంలో తాగునీటి బోర్లుకు మరమ్మత్తులు చేస్తున్న సిబ్బంది

రాజాం: మండలంలోని కంచరాం గ్రామంలో నాలుగు తాగునీటి బోర్లుకు బుధవారం మరమ్మతులు జరిపారు. క్రాష్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రాజేష్ తెలిపారు. బోర్ మెకానిక్‌లో గ్రామాల్లో మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లుకు మరమ్మతులు జరుపుతున్నట్లు సర్పంచ్ గెడ్డాపు సుబ్బమ్మ వెల్లడించారు.

బోర్లకు మరమ్మతులు

సంతకవిటి: మండలంలోని గరికిపాడు గ్రామంలో తాగునీటి బోర్లకు బుధవారం క్రాష్ ప్రోగ్రాం ద్వారా మరమ్మతులు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంతోష్‌కుమార్ వెల్లడించారు. మెకానిక్‌లు త్రినాథ్, మన్మథరావు, కృష్ణమూర్తి మరమ్మతులు జరిపి కొత్త పార్టులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యడ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

వలంటీర్లే కీలకం

- ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు



వలంటర్లకు నియామకపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందజేయడంలో వలంటీర్లే కీలకమని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. ఆరికతోట గ్రామంలో ఖాళీ అయిన రెండు వలంటీర్ పోస్టులకు ఎంపికైన వారికి బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులతో పాటు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అందరూ ప్రజా సేవకులమన్నారు. వలంటీర్ల సేవా పరమావధిగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమామణి, వైస్ ఎంపీపీ పెంకి అరుణ, పెంకి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్దవోలులో డ్రోన్ సర్వే ప్రారంభం



డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న అధికారులు

తెర్లాం: మండలంలోని పణుకువలసలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా చేపట్టనున్న భూముల రీసర్వేకి సంబంధించి బుధవారం డ్రోన్ సర్వే ప్రారంభించారు. తహసీల్దార్ డోల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన డ్రోన్ సర్వే పూర్తయిన వెంటనే గ్రామానికి చెందిన ఓఆర్ఐ మ్యాప్‌లు వస్తాయని, వీటి ద్వారా గ్రామాల్లోని అన్ని రకాల భూములకు సరిహద్దులు గుర్తించి, హద్దురాళ్లు పాతడం జరుగుతుందని మండల సర్వేయర్ వెంకటరమణ తెలిపారు. భూముల రీసర్వే పూర్తయితే గ్రామాల్లో భూ సమస్యలు తీరిపోతాయని చెప్పారు. రీసర్వేకి రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామపెద్దలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చందక సత్యనారాయణ, డి.గదబవలస, పణుకువలస గ్రామాల మాజీ సర్పంచ్‌లు వావిలపల్లి ఆదినారాయణ, ఎస్.అప్పలనాయుడు, గ్రామ పెద్దలు సాగిరాజు అప్పలరాజు, గొందాల వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు భద్రరాజు, వీఆర్ఓ, సచివాలయ సర్వేయర్ పాల్గొన్నారు.

సమాజ భద్రత అందరి బాధ్యత



మునకలవలసలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

రేగిడి: సమాజ భద్రతపై ప్రజలంతా ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మునకలవలస గ్రామాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సమాజ భద్రతపై అవగాహన కల్పించారు. ఆస్తుల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాలు – జాగ్రత్తలు, శాంతిభద్రతల రక్షణ, ఇరుగుపొరుగు వారితో స్నేహబంధాలు వంటివి వివరించి, ప్రతీ ఒక్కరి ఇతరులకు సాయం చేస్తూ జీవనం సాగించాలని సూచించారు. వివాదాలకు దూరంగా ఉండడం, పిల్లలను కష్టపడి చదివించడం, చిన్నప్పటి నుంచి నైతిక విలువలు నేర్పించడం చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్‌రావు, మాజీ సర్పంచ్ శాసపు జనార్దనరావు, మాజీ ఎంపీటీసీ శాసపు తవిటినాయుడు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ నాగలక్ష్మి



కృష్ణాపురంలో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



గొల్లపల్లి వేణుగోపాల మున్సిపల్ హైస్కూల్‌లో ఆర్వో ప్లాంట్‌ను స్వయంగా పరిశీలిస్తున్న కలెక్టర్

బొబ్బిలి: ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల్లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నాడు – నేడు పనులు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ ఆదేశాలు జారీ చేశారు. బొబ్బిలి పరిసర గ్రామాల్లో బుధవారం ఆమె సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభానికల్లా పనులు పూర్తి కావాలన్నారు. గొల్లపల్లి వేణుగోపాల మున్సిపల్ హైస్కూల్, మండలంలోని కలువరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జరుగుతున్న పనులను పరిశీలించారు. గొల్లపల్లిలో పనుల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. బిల్లులు పడుతున్నా పనులు ఎందుకు నెమ్మదిగా జరుగుతున్నాయని ప్రశ్నించారు. పనులు త్వరగా చేపట్టాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పాఠశాలలోని తాగునీటి ప్లాంట్‌ని తాగి పరిశీలించారు. పదో తరగతి తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తున్నారా, లేదా అని ఆరా తీశారు. అనంతరం మండలంలోని కృష్ణాపురంలో చేపడుతున్న రీసర్వేను పరిశీలించారు.

పాలిసెట్ కేంద్రం పరిశీలన..

మండలంలోని కోమటిపల్లి స్వామి వివేకానంద పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ జరుగుతుండగా.. కేంద్రాన్ని కలెక్టర్ నాగలక్ష్మి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌కు పలు సూచనలు చేశారు.

కంచరవీధి సచివాలయం తనిఖీ..

పట్టణంలోని కంచరవీధి సచివాలయాన్ని కలెక్టర్ నాగలక్ష్మి తనిఖీ చేశారు. ఈ సమయంలో వైద్య సిబ్బంది మహిళలకు రక్తపరీక్షలు చేస్తున్నారు. అయితే అందరి రక్త పరీక్షల ఫలితాలు ఒకేలా ఉండడంతో, కలెక్టర్ డీఎంహెచ్ఓతో ఫోన్‌లో మాట్లాడుతూ, రిపోర్టులను మరోసారి పరిశీలించి తనకు పంపించాలని సూచించారు. అనంతరం మున్సిపాలిటీల్లో పర్యటించారు. ఇంటింటి చెత్త సేకరణ, తదితర అంశాలపై సిబ్బందిని ప్రశ్నించారు. ఆమె వెంట ఇన్‌చార్జ్ ఆర్‌డీఓ బి.సుదర్శన దొర, మున్సిపల్ కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు తహసీల్దార్ ఎన్. రాజారావు, ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, వ్యవసాయశాఖ ఎ.డి మజ్జి శ్యామ్‌సుందర్, ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు, మున్సిపల్, మండల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పైడితల్లి హుండీ ఆదాయం రూ.2.46 లక్షలు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి హుండీ కానుకలు బుధవారం లెక్కించారు. మొత్తం 70 రోజులకుగాను రూ. 2,46,0550లు సమకూరిందని ఈఓ బీవీ మాధవరావు తెలిపారు. లెక్కింపులో ఆలయ ట్రస్టీ వాకచర్ల దుర్గాప్రసాద్, నవదుర్గ ఆలయ ఈఓ పి.శ్యామలరావు, సిబ్బంది పాల్గొన్నారు.